www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 5 నవంబర్ 2023
5
వైఎస్ఆర్



మెరుగైన విద్యా బోధన చేయాలి

కడప సిటీ : మెరుగైన విద్యాబోధన ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధ్యమని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో టీచర్స్, న్యూమరసి, మహిళా శిశు సంక్షేమ శాఖ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్లకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడు మాత్రమే విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెరుగుతుందన్నారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలందరు తప్పకుండా చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కృత్యాల ద్వారా ఎప్పటికైనా బోధన చేస్తూ విద్యార్థులు పాఠశాల రావడానికి ఆసక్తి పెరుగుతుందని చెప్పారు.

పేదల ఇళ్లు కూల్చివేత

- జి.బి.నగర్‌లో నిరాశ్రయులైన 33 పేద కుటుంబాలు
- రూ.50 లక్షల మేరకు ఆస్తి నష్టం
- దగ్గరుండి పడగొట్టించిన రెవెన్యూ, పోలీసు అధికారులు
- బాధితులకు సిపిఎం నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

మండలంలోని జి.బి.నగర్ కాలనీలో సుమారు 20 సంవత్సరాలుగా జీవనం కొనసాగిస్తున్న పేదల ఇండ్లను రెవెన్యూ, పోలీసు అధికారులు శనివారం జెసిబిలతో అక్రమంగా కూల్చివేశారు. ఇళ్ల కూల్చివేతతో పేదలకు రూ.50 లక్షల వరకు నష్టం కలిగించారు. మహిళలు, వృద్ధులు ఇళ్ల కూల్చవద్దని, తమను నిరాశ్రయులను చేయవద్దంటూ తహశీల్దార్‌కు వేడుకున్నా పట్టించుకోకుండా కూల్చివేశారు. బాధితులందరూ కన్నీరుమున్నీరుగా విలపించారు. కాలనీ వాసులు పనికి వెళ్లిన సమయంలో తహశీల్దార్ పోలీసులను వెంట తీసుకుని వచ్చి గుంటూరు బాపనయ్య కాలనీలోని ఇండ్లను డోజర్‌లతో కూల్చివేశారు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. జెసిబికి అడ్డంగా పడుకుని నిరసన తెలిపారు. ఆయనను పోలీసులు పక్కకు లాగేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు బాపనయ్య కాలనీ వాసులకు 20 సంవత్సరాల నుండి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో రాస్తా రోకోలు, ధర్నాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన విషయం తెలిసిందే. అంతా తెలిసి కూడా తహశీల్దార్ ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయంటూ ఇళ్లను కూల్చివేశారు. నిరాశ్రయులైన వారిలో ఎక్కువగా గిరిజనులు, దళితులు ఉన్నారు.

సిపిఎం నాయకులు భైరవప్రసాద్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

నా ఇంటిని కూల్చేశారు

20 సంవత్సరాల నుండి కాలనీలో జీవనం కొన సాగిస్తున్నాం. కూలి చేసుకుంటేనే తప్ప జీవనం సాగదు. అలాంటి తాము ఇళ్లు కట్టుకుంటే రెవెన్యూ అధికారులు అక్రమంగా కూల్చివేశారు. అధికారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

- కొడవటి గంటి మేరీ, జి.బి.నగర్ కాలనీ.

అప్పు చేసి ఇల్లు కట్టుకున్నా

అప్పు చేసి కాలనీలో ఇల్లు కట్టుకున్నాం. ఇంటిని కూల్చివేయడంతో తాము ఏ విధంగా జీవించాలో తెలియడం లేదు. ఎక్కడ తల దాచుకోవాలి. మాకు ప్రస్తుతం ఎక్కడా ఇల్లు లేదు. ఉన్నతాధికారులు మాకు న్యాయం చేయాలి.

- షేక్ బీబీ, జి.బి.నగర్ కాలనీ.

పేదల ఇళ్లు కూల్చడం దుర్మార్గం

పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేయడం దుర్మార్గం. నిరుపేదలు కాలనీలో జీవనం కొనసాగిస్తుంటే ప్రభుత్వం ఇలా చేయడం సరికాదు. కూలి చేసుకుంటూ పేదలు ఇళ్లు కట్టుకుంటే రెవెన్యూ అధికారులు కూల్చివేయడంతో వారంతా నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం వెంటనే పేదలకు అక్కడే పక్కా ఇళ్లను నిర్మించాలి. అధికారుల తీరుపై సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తాం.

- ఎన్.బైరవ ప్రసాద్, మండల కార్యదర్శి, సిపిఎం.

ఆందోళన వ్యక్తం చేస్తున్న జి.బి. నగర్ కాలనీ వాసులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేశాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న ఇళ్లను కూల్చివేశాం. పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాల్సి ఉంది. జాయింట్ కలెక్టర్ పోర్టల్‌కు పేదల నుంచి 180 దరఖాస్తులు వచ్చాయి. వారికి పట్టాలు మంజూరు చేయడం కోసం ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేశాం. కాలనీలో నివాసముంటున్న ఇళ్లను కూల్చి వేయలేదు.

- గంగయ్య, తహశీల్దార్, పోరుమామిళ్ల.

7న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

మద్దతు ఇవ్వాలని టిడిపి నాయకులకు వినతి పత్రాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కరువు మండలాలను ప్రకటించాలని ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ఆందోళనకు మద్దతు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, ఉపాధ్యక్షులు రామమోహన్ విజ్ఞప్తి చేశారు. శనివారం తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బి. హరిప్రసాదను కలిసి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో కరువు మండలాలను ప్రకటించకపోవడంతో కరువు మండలాల పట్ల ముఖ్యమంత్రికి ఏమాత్రం కనికరం లేదని వారు వాపోయారు. కరువు మండలాలు ప్రకటించాలని ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలం చెందారని విమర్శించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ఉండింటే ఈరోజు కొంత వరకైనా కరువును నివారణ చేయవచ్చని, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఇవాళ జిల్లాలో కరువు విలయతాండవం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ 103 కరువు మండలాలు ప్రకటిస్తే కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా ప్రకటించకపోవడం చాలా దుర్మార్గమని తెలిపారు. జిల్లాలో 36 మండలాలలో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని తెలిపారు. జిల్లా ప్రజా ప్రతినిధులు ఉన్న తాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు వర్షమే కురవలేదని పంట పొలాలన్నీ బీడు భూములుగా ఉన్నాయని రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నా కూడా చినుకులు పడలేదని తెలిపారు. పంట నష్టపోయిన రైతాంగానికి పూర్తి నష్టపరిహారం చెల్లించాలని, మళ్లీ పంట వేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు. కరువు కోరల్లో చిక్కిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనకు తెలుగుదేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలు రైతులు ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలియజేస్తామని శ్రీనివాస రెడ్డి హరిప్రసాద్ తెలిపారు.

శ్రీనివాసరెడ్డికి మద్దతు కోరుతున్న దస్తగిరిరెడ్డి

బాల్య వివాహాల నివారణకు చర్యలు

కడప : జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలుతో పాటు బాల్యవివాహాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్‌రెడ్డికి తెలిపారు. శనివారం విజయవాడ సిఎస్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష, మహిళా శిశు సంక్షేమం, విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్, బాల్య వివాహాల నివారణ, నాడు- నేడు, జగనన్నకు చెబుదాం అంశాలపై కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకంగా బాల్య వివాహాలను అరికట్టే చర్యలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఆయా కేంద్రాల్లో రెఫరల్ కోసం గుర్తించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి చికిత్స అందించడానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్ పూర్తి చేస్తామన్నారు.

అఖిలపక్ష కమిటీపై అభాండాలు తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

యాకూబ్ సాహెబ్ మసీదు శ్మశానానికి సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కూడిన అఖిలపక్ష కమిటీ నాయకులపై వైసిపి నాయకులు అభాండాలు వేయడం తగదని వారు పేర్కొన్నారు. శనివారం రహమతీయ ఫంక్షన్ హాలులో కమిటీ నాయకులు సమా వేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాకూబ్ సాహెబ్ మసీదుకు చెందిన శ్మశానానికి చెందిన విషయంలో అఖిలపక్ష కమిటీ నాయకులు ఎక్కడ దాక్కున్నారని వైసిపి నాయకులు ఎగతాళి, ఎద్దేవా చేయటాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామని చెప్పారు. గత సోమవారం రోజు అఖిలపక్ష కమిటీ నాయకులు కలెక్టర్‌ని కలిసి రోడ్ల విస్తరణకు, అభివృద్ధి కార్యక్రమాలకు అఖిలపక్ష కమిటీ వ్యతిరేకం కాదని అందుకు సహకరిస్తామని చెప్పామన్నారు. శ్మశానానికి సంబం ధించి అర్జీపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి కమిషనర్‌తో, కమిటీ నాయ కులతోచర్చించి ఆమోదకరమైన పద్ధతిలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేయవద్దని కలెక్టర్ సూచించినందున మౌనంగా ఉన్నామని చెప్పారు. తమ మౌనాన్ని చేతకాని తనంగా భావించి సోషల్ మీడియాలోనూ, మీడియాలోనూ ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారని వాపోయారు. అఖిలపక్ష కమిటీని విమర్శించే వారు యాకూబ్ సాహెబ్ మసీదు శ్మశానానికి చెందిన సమాధులకు ఎటువంటి నష్టం జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటారో చెబితే తాము కూడా వారిని స్వాగతిస్తామని తెలిపారు. ప్రజలందరూ వాస్తవాలను గ్రహిం చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అమీర్ బాబు, సలావుద్దీన్, నజీర్ ,ఎస్ ఏ సత్తార్, నిస్సార్, దస్తగిరి, అక్రమ్, జాకీర్, మౌలానా, అల్లాహ్ బకష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

విద్య, ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

కడప : పిల్లల విద్య ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ ఆదేశించారు. శనివారం కడప నగరంలోని చిన్న చౌక్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకులాన్ని జడ్జి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. వంట, వసతి, తర గతి గదులను పరిశీలించారు. వారికి అందుతున్న భోజనం సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ మణికుమారి, వార్డెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ఘటనలు చోటు చేసుకోవడానికి వీల్లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలు లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్లకు, చెడు నడత కలవారికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న రౌడీ షీటర్లకు సాక్ష్యాధారాలతో శిక్షలు పడేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. తద్వారా వారి అక్రమ కార్యకలాపాలకు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలవుతుందని తెలిపారు. 'దిశ', ఫోక్సో తదితర ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఖదీరున్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ప్రవీణ్ కుమార్, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - కడప

నేటి కాలంలో ఊబకాయం, మధుమేహం అనేవి సమాజానికి పెను సవాళ్లు మారుతున్నాయని ఫిట్ ఇండియా ట్రైనర్, ఫిజియో థెరపిస్ట్ పవన్ అన్నారు. శనివారం సాయంత్రం ఆర్ట్స్ కళాశాలలో పిజికల్ ఎడ్యుకేషన్, ఎన్‌సిసి డిపార్ట్మెంట్స్ సం యుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకుల నుద్దేశించి లిఫిట్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం, ఊబకాయం, థైరాయిడ్ , అజీర్తి వంటి రోగాలు రాకుండా నిత్య జీవితంలో ఎలాంటి ప్రాథమిక వ్యాయామాలు చేయాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కొన్ని ఆసనాలు ద్వారా ప్రత్యక్షంగా చేసి చూపించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కళాశాలలోని జిమ్, గ్రౌండ్‌లను అందరూ వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు కొన్ని యోగా ముద్రలు, ఆసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేశ్, పిజికల్ డైరెక్టర్ టి. హజరతయ్య , ఎన్‌సిసి అధికారులు ఆర్ నీలయ్య, బి. మహేష్, అధ్యాపకులు శివ పార్వతి, బయపు రెడ్డి, వి. ఆదినారాయణ, విజయ కుమార్, వెంకట సుబ్బయ్య, రాజేశ్వరి, సావిత్రి, సి. విశ్వనాథరావు, సుందరే శ్వరరావు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పవన్

రాష్ట్రంలో అధ్వాన పాలన

కడప అర్బన్ : రాష్ట్రంలో అధ్వానమైన పాలన సాగుతోందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని హరిత హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్‌రెడ్డిపై ఉన్న కేసుల నుంచి ఎన్నిసార్లు తప్పించుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని రంగాలను సిఎం పూర్తిగా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని విమర్శించే అర్హత విజయసాయి రెడ్డికి లేదని చెప్పారు. మద్యంలో భారీ స్థాయిలో దోపిడీ కొనసాగుతూ ఉందని, దీనిపై కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అమీషాకు నివేదిక ఇచ్చామని పేర్కొన్నారు. సిబిఐ ఇడి కేసులో ఇరుక్కున్న మాట వాస్తవం కాదా, విజయసాయి రెడ్డి తప్పు చేయలేదా అని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో పిటిషన్ క్వాష్ అయితే చంద్రబాబు నాయుడు కేసులన్నీ మటాస్ అన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడప : ప్రతి ఒక్కరికీ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలని శాశ్వతలోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమని శాశ్వతలోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఎం. ప్రదీప్ కుమార్ సంయుక్తంగా పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్‌కెఆర్‌అండ్‌ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియం సమావేశ హాల్‌లో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై ఎస్‌కెఆర్‌అండ్‌ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు, అధ్యా పకులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'శాశ్వత లోక్ అదాలత్' అనే వ్యవస్థ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం కలిగివున్న వారందరికి ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేయడమైందన్నారు. కడప జిల్లా కోర్టు ఆవరణంలో ఉన్న ఈ వ్యవస్థ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టానికి లోబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వంచే ఏర్పాటు చేశారన్నారు. పూర్తి వివరా లకు జిల్లా కోర్టు ఆవరణలోని శాశ్వతలోక్ అదాలత్ కార్యాలయంలో, 8639684279, 9963731698లలో సంప్రదించాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా, వైస్ ప్రిన్సిపల్ గురివిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుల శివానందరెడ్డి విగ్రహానికి ఘన నివాళి

కడప అర్బన్ : విద్యా దాత, పారిశ్రామికవేత్త, రాజకీయవేత్త, కందుల గ్రూప్ విద్యా సంస్థల మాజీ అధిపతి, మాజీ శాసన మండలి, కడప నియోజకవర్గ శాసనసభ్యులు కీ.శే. కందుల శివానంద రెడ్డి అని మాజీ పార్ల మెంటు సభ్యులు రామము రెడ్డి కొనియాడారు. శనివారం శివానందరెడ్డి తృతీయ వర్ధంతిని పుస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు కెఎస్ఎన్ఆర్ ఘాట్‌లో ఉన్న విగ్రహానికి పూల మాలతో నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 356 మంది కంటి పరీక్షలకు హాజరయ్యారు. 216 మంది రక్త దానం చేశారు. అనంతరం మానసిక వికలాంగులు ఆశా నిలయం (కొప్పర్తి)లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో ఐదుగురికి నగదు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కందుల రాజమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్, ట్రెజరరీ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), కెఒఆర్ఎం కళాశాల చైర్మన్ వెంకట శివా రెడ్డి, వైస్ చైర్మన్ లిఖితా రెడ్డి, వైసిపి నాయకులు అభిమానులు,మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రారిశ్రమిక వేత్త కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

ఏడు బాణాసంచా దుకాణాలకు అనుమతి

ఒంటిమిట్ట : దీపావళి సందర్భంగా ఏడు బాణాసంచా దుకాణాల ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చామని తహశీల్దార్ మాధవిలత పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ కోదండరామ స్వామి కల్యాణ మండపం వెదురుగా ఎండోమెంట్ స్థలంలో ఒక్కొక్క దుకాణానికి ఏర్పాటు చేస్తూ లాటరీ పద్ధతి లో వారికి మంజూరు చేశారు. దుకాణం పెట్టుకునేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీసు, అగ్నిమాకశాఖల అనుమతులు తప్పక తీసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద బకెట్లో ఇసుక, డ్రమ్ములలో నీళ్లు అందుబాటులో ఉంచు కోవాలన్నారు.

8న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

కడప అర్బన్ : కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయొద్దని ఈనెల 8 న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర, అధ్యక్షులు సునీల్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పూలరాజు, ఆర్ ఎస్ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, పి డి ఎస్ యు నగర కార్యదర్శి శ్రీనాథ్ పిలుపినిచ్చారు. బంద్‌కు సంబందించిన పోస్టర్లను శనివారం వైవీయూలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని దశాబ్దానికిపైగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం శిలాఫలకాలకే పరిమితం అయ్యాయన్నారు.

భూకబ్జాలపై సిట్ వేయించాలి : టిడిపి

కడప అర్బన్ : దొంగలు దొంగలు కలసి ఊళ్ళు పంచుకొన్న చందంగా వైసిపి నాయకులు వీలునామాలు తయారుచేసి పేదల భూములు సైతం కబ్జా చేస్తున్నారని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే సొంతజిల్లాలో సిట్ వేయించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని హరి టవర్స్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు జిల్లాలో భూకబ్జాలపై, ఆస్తుల మార్ఫింగ్‌పై సిట్ వేసిన ముఖ్యమంత్రి తన సొంతజిల్లా పులివెందుల నియోజకవర్గంలో స్టాంపులు మార్చి, స్థలాలు కబ్జా చేసిన వారిపై పోలీసుకేసు పెట్టారేకాని సిట్ వేసి దోషులను ఎందుకు శిక్షించలేదని ప్రశ్నించారు. వైసిపి నాయకులు, కొందరు లాయర్లు,రెవెన్యూ అధికారులు కలసి స్టాంప్ మార్ఫింగ్‌లతో భూకబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. కడప, చింతకొమ్మదిన్నె, బద్వేలలలో యథేచ్ఛగా భూకబ్జాలు అవుతున్నాయని, సాక్ష్యాలు ఉన్నా అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. బద్వేల్లో స్టాంపు వెల్డర్ రూ. 20 స్టాంప్‌ను రూ.100 స్టాంప్‌గా మార్చి వీలునామా సృష్టించారని పేర్కొన్నారు. ఆర్‌టిఐ ద్వారా అందిన సమాచారం మేర అది రూ.20గా స్టాంపుగా ధృవీకరించారని తెలిపారు. ఈ విషయమై సాక్షాత్తు ముఖ్యమంత్రికి, ఎస్‌పికిఫిర్యాదు చేశామని చెప్పారు. సమావేశంలో ఉపాధి హామీ మాజీ సభ్యుడు పోతుగంటి పిరయ్య, టిడిపి మీడియా కో- ఆర్డినేటర్ జనార్దన్, నాయకులు గంధం ప్రసాద్,ఆవుల వెంకటేష్ పాల్గొన్నారు.

అటవీ శాఖ స్థలాన్ని అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి- చెన్నూరు

అటవీ శాఖ స్థలాన్ని అభివృద్ధి చేసి చిల్డ్రన్స్ పార్క్, రూములు, వాకింగ్‌కు ఉప యోగ పడేలా తయారు చేస్తామని అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎర్ర సాని మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొండపేటలో పాడుబడిన అడవి శాఖ స్థలాన్ని ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం నడిబొడ్డున ఉన్న రెండు ఎకరాల స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మించి ప్రజలకు ఉపయోగపడే చేస్తామని ఆయన అన్నారు. వెంటనే అంచనా తయారు చేసి పంపాలని డిఎఫ్ఒను ఆదేశించారు. కొండపేట సర్పంచ్ చంద్ర యాదవ్ మాట్లాడుతూ కొండపల్లి గ్రామస్తులకు త్వరలోనే చిల్డ్రన్స్ పార్కు ఎందుకు కృషి చేస్తున్న సిఎంజగన్మోహన్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, ఎంపిటిసి నాగిరెడ్డి, పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ అల్లి శ్రీరామ్మూర్తి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ పెదబల్లి ప్రతాప్ రెడ్డి, భాస్కర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను కొనసాగించాలని డిఇఒ రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తెలుగు అధ్యాపకులు మేకల శివార్జున హామీ మేరకు సిద్ధవటం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భాకరాపేటలో పదవ తరగతి వార్షిక పరీక్షల్లో తెలుగులో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన జి.వి. సువర్షిణి, 100/100, పి.కామేశ్వరి 99, సి.యశస్విని 98, పి.శాంతి 97, పి.సుమిత్ర 94, కె. లక్ష్మీ సుష్మ 93 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీ కేశమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డిఇఒ

కనికరమేదీ?

ప్రజాదృష్టి

జిల్లాలో కరువు కరాళనృత్యం చేస్తోంది. ఖరీఫ్ తరహా వాతావరణ పరిస్థితులే రబీలోనూ కొనసాగుతుండడం ఆందోళన కలిగి స్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిబంధనల పేరుతో కరువును తగ్గించి చూసే ప్రయత్నం చేయడం విడ్డూరమనే చెప్పాలి. రాజకీయ కోణంలో కరువు పరిస్థితులను అంచనా వేయ కుండా వాస్తవ పరిస్థితులను మానవతా దృక్పథంలో పరిశీలన చేసి రైతారానికి న్యాయం చేయాల్సిన అవసరం ఉరుముతోంది. వాతావరణంలో చిన్నమార్పు చోటుచేసుకున్నా రైతాంగమే ఎక్కువగా నష్టపోతున్నారనే విషయాన్ని గమనంలో ఉంచుకుని కరువు మండలాలను గుర్తించాలి. ఇటువంటి మావనతా దృక్పథాన్ని విస్మరించి, రాజకీయ కోణంలో కరువు మండలాలను గుర్తించడం విడ్డూరమనే చెప్పాలి. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలో 17 మండలాల్లో కరువు పరిస్థితులు పతాకస్థాయికి చేరుకున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం కరువు మండలాలను గుర్తించింది. కరువు మండలాల ప్రతిపాదనల్ని అందజేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాలోనే కరువు తాండవం చేస్తుంటే పాలకులు కళ్లు మూసుకుని ఉన్నారనే విమర్శలు వస్తాయనే కోణంలో ఒక్క ప్రాంతాన్ని కరువు మండలముగా ఎంపిక చేయకపోవడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో 23 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయని జిల్లా అధికార యంత్రాంగం గుర్తించింది. కరువు మండలాల ప్రతిపాదనల్ని అందజేసింది. జిల్లా అధికార యంత్రాంగం కేంద్రప్రభుత్వం పేర్కొన్న పారామీటర్ల మేరకు కరువు మండలాలను గుర్తించిన సంగతి తెలిసిందే. రాష్ట్రప్రభుత్వం రాజకీయ కోణంలో పరిశీలించి కడప జిల్లాలో కరువు మండలాల గుర్తింపును ఉద్దేశపూర్వకంగా విస్మరించిందనే చెప్పాలి. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలో 23 మండలాలకుగానూ 18 మండలాలకు కుదించడం విస్మయాన్ని కలిగించింది. ఒక్కో మాసంలో ఒకటి నుంచి రెండు డ్రైస్పెల్స్ నమోదు కావడం వంటి పారామీటర్లను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు పంపించినప్పటికీ ఎంపిక చేయకపోవడం విస్మయాన్ని కలిగించింది. ఇటువంటి రాజకీయ కుత్సితాలతో రైతాంగాన్ని ముడివేయడం అభ్యంతరకరమని చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత రాజకీయ ధోరణుల్ని నిలదీస్తూ జిల్లా రైతాంగాన్ని రౌండ్ టేబుల్స్, ఇతర నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తేనే కరువు మండలాల సవరింపు ఉంటుందనే సంగతిని గుర్తించుకుని ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి ఉంది. ఇటువంటి బృహత్తరమైన ఉద్యమ కార్యకలా పాలను రైతు సంఘాల నాయకులు ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. రాజకీయ కుత్సితాలను గుర్తించి ప్రభుత్వ తీరును నిశితంగా విమర్శిస్తూ రైతాం గం రోడ్డుపైకి వచ్చినప్పుడు రాజకీయ పార్టీల నాయకత్వాలను రైతాంగ సమ స్యలపై దృష్టి సారించేలా చేసినప్పుడే రైతు సంఘాల నాయకత్వాలు వర్థిల్లగలవని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

లబ్ధిదారులకు భూమి రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - ముద్దనూరు

భూమి కొనుగోలు పథకం ద్వారా ప్రభుత్వం ఎస్సీ మహిళా రైతులకు జీవనోపాధి కోసం ఇచ్చిన భూమిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు కడప ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య తెలి పారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం భూమి కొనుగోలు పథకం సంబంధించిన డాక్యుమెంట్లను సబ్ రిజిస్టర్ వీర మృణాళిని రిజిస్టర్ చేశారు.

రిజిస్టర్ చేస్తున్న అధికారులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కొనుగోలు పథకం 1992 నుండి 2008 వరకు అమలులో ఉందన్నారు. ప్రభుత్వం రైతుల వద్ద ఎకరా లక్షతో భూమి కొనుగోలు చేసి భూమిలేని ఎస్సీ మహిళా రైతులకు ఉచితంగా ఇచ్చిందన్నారు. జీవనోపాధి కోసమని ఎస్సీ మహిళ రైతుల కోసం ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన భూములను అమ్మకుండా ఉండేందుకు ప్రభుత్వం తనఖా పెట్టడం జరిగిందన్నారు. తనఖా పెట్టిన ఈ డాక్యుమెంట్లను ప్రభుత్వమే మళ్లీ లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల మండలానికి చెందిన 193 మంది లబ్ధిదారులకు 236.84 ఎకరాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ముద్దనూరు 65 మందికి 72.15 ఎకరాలు, కొండాపురం 119 మందికి 150.14 ఎకరాలు, ఎర్రగుంట్ల 9 మందికి సంబంధించి 14.55 ఎకరాల భూమి అందించనున్నట్లు చెప్పారు. ఈనెల 15న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది భాస్కర్ పాల్గొన్నారు.

కందుల శివానందరెడ్డి చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమలో ఉన్న వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి, విద్య అవకాశాలు కల్పించిన కందుల శివానందరెడ్డి చిరస్మరణీయుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కందుల శివానందరెడ్డి మూడవ వర్ధంతిని పురష్కరించుకొని వేంపల్లె లోని కందుల ఐటిఐలో ఆయన చిత్రపటానికి తులసిరెడ్డి, టి.వెల మవారిపల్లె 0మాజీ సర్పంచ్ రహీం, పంచా యతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి, ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు నివాళులర్పించారు.

వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఐటిఐ సిబ్బంది

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో విద్యార్థులను ఉద్దేశించి తులసిరెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది నాయకులు జిల్లాలో ఉన్నప్పటికీ వారిలో ప్రత్యేకశైలి, గుర్తింపు కలిగిన నాయకుడు శివానందరెడ్డి అని కొనియాడారు. అటు పారిశ్రామిక వేత్తగా, ఇటు విద్యాదాతగా, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలోనూ, రాజకీయ రంగంలోనూ, సేవా భావంలోనూ ఆయన సేవలు ప్రశంసనీయమన్నారు. పలువురు శివానందరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది అమర్నాథరెడ్డి, ప్రభాకర్ నాయుడు, ఉత్తమారెడ్డి, చంద్రశేఖర్, నరసింహారెడ్డి, విజయ్‌భాస్కర్, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిన్న దండ్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రజల అవసరాలను తెలుసుకొని, వారి ముంగిటికే సేవలను తీసుకొచ్చారని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ ప్రభుత్వ సలహాదారుడు తిరుపాల్ రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేపటి నుంచి ఒంగోలు జాతి పశువుల ప్రదర్శన

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ 1వ వార్డు పూసయ్యగారి ఆశ్రమం ధరణి తిమ్మాయపల్లె గ్రామంలో దిగంబర అవధూత కొండయ్యస్వామి 42వ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం నుండి గురువారం వరకు జాతీయస్థాయి ఒంగోలు జాతి పశువుల బల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాక్‌పాట్, సీనియర్స్, ఓల్డ్ క్యాటగిరి 6పళ్ళ విభాగాలలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం జాక్‌పాట్ విభాగంలో ప్రదర్శన ఉంటుందన్నారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు 1వ బహుమతి రూ.3 లక్షలు, 2వ బహుమతి రూ.2 లక్షలు అందిస్తామని తెలిపారు. మంగళవారం సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని తెలిపారు. 1వ బహుమతి రూ.1,58,118, 2వ బహుమతి రూ.1,08,118, 3వ బహుమతి రూ.75,118, 4వ బహుమతి రూ.50,118, 5వ బహుమతిగా రూ.25,118 అందిస్తామని తెలిపారు. 8న బుధవారం ఓల్డ్ క్యాటగిరి విభాగానికి, 9న గురువారం 6పళ్ల ఎద్దులకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆప్కాస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో పని చేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులనందరినీ క్రమ బద్ధీకరించాలని ఆప్కాస్ అధ్యక్షుడు సుబ్బారావు కోరారు. ఆ మేరకు ఆప్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తికి శనివారం వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రం ఇస్తున్న ఆప్కాస్ సభ్యులు

ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఆప్కాస్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వం పోర్టల్‌గా చూపిస్తున్న కారణంగా తమకు వర్తించే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదన్నారు. ఆప్కాస్ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పిం చాలన్నారు. ఆప్కాస్ సిబ్బందికి 15 సెలవులు సిఎల్‌కు అదనంగా ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసే 25సిఎల్‌లు తమకు వర్తింపజేయాలన్నారు. పనికి తగ్గ వేతనమివ్వాలన్నారు. గతంలో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆప్కాస్ కార్పొ రేషన్‌లోకి మార్చే క్రమంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లు ఇఎస్‌ఐ, పి.ఎఫ్‌లో తప్పుగా నమోదుచేయబడిన వాటిని సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి సుబ్బన్న, కోశాధికారి కుమార్, సభ్యులు మైకేల్, వెంకటరమణ, బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

దేశ పురోగతికి అవినీతి ప్రధాన అవరోధం

ప్రజాశక్తి - చాపాడు

దేశ పురోగతికి అవినీతి ప్రధాన అవరోధమని ఆంధ్రప్రగతి బ్యాంక్ మేనేజర్ పి.శైలజ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నగురువలూరు గ్రామంలో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా స్వామి వివేకానంద విద్యానికేతన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్యార్థులు పాటుపడాలన్నారు. అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అన్ని పనులు నిజాయితీ, పారదర్శకంగాను చేస్తే అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి అనేది దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి ఒక ప్రధాన అవరోధమన్నారు. భావి భారత పౌరులైన విద్యార్థుల జీవితాల్లోనే అవినీతి వల్ల జరిగే ప్రమాదాన్ని గుర్తింపజేయాలని సూచించారు. విద్యార్థి దశ నుండి ఇటు వంటి వాటిని ప్రోత్సహించకుండా ఆపాలన్నారు. మన దేశ పురోగతికి అవరోధం అవినీతి అనే అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ క్యాషియర్ సి.ప్రశాంత బాబు, సత్యక్రిష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు.. కనికరించని పాలకులు

కరువు జాబితాలో కానరాని మండలం, అప్పుల ఊబిలో రైతులు

వర్షం లేక ఎండిపోతున్న మినుము పంట, బీడుగా మారిన పొలాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రబీ ప్రారంభమై నెల గడిచినా వరుణదేవుడు మాత్రం రైతులపై కరుణించడంలేదు. వర్షాలు లేక మండల వ్యాప్తంగా వేల ఎకరాల భూములు బీళ్లుగా మిగిలాయి. అక్కడక్కడ రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. తోటల్లో సాగు చేస్తున్న చీనీ వంటి పంటలకు కూడా బోర్లలోని నీరు అందక ట్యాంకర్ల సాయంతో నీరు అందిస్తున్న రైతులు మండలంలో దర్శనమిస్తున్నారు. కానీ అధికారులు మాత్రం ఎలాంటి కరువు ఛాయలు కనిపించనట్లు మౌనం వహిస్తున్నారు. దీనికితోడు కరువు మండలాల జాబితాలో కూడా మండలం పేరు లేకపోవడంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఎక్కడ పడ్డాయో చూపించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధులను రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధులు ఏమీ పట్టనట్లు ఉండడం దారుణమని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అధికంగా రైతులు శనగ పంట పండిస్తారు. వర్షం కురుస్తుందని ఆశతో సేద్యాలు చేసి ఫాస్పేట్ వంటివి చల్లి విత్తనానికి భూములను సిద్ధం చేశారు. శనగ విత్తనానికి అదును దాటుతున్నా వర్షం పడక మండలంలో ఏ ఒక్క ఎకరా కూడా సాగుకు నోచు కోలేదు. రైతులు సేద్యాలు, ఫాస్పేట్ అంటూ ఎకరాకు దాదాపు రూ.5000 నుండి రూ.8000 ఖర్చు చేశారు. అటు సాగుచేయక.. ఇటు తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు లబోదిబోమంటున్నారు. ఖరీఫ్‌లో కూడా సరైన వర్షాలు లేక పంట సరిగా రాలేదని, పశువులకు కనీసం మేత కూడా లేదని రైతులు వాపోతున్నారు. అప్పుల పరిస్థితి అటుంచితే కనీసం జీవనం కూడా భారంగా ఉందని రైతులు వాపోతున్నారు. పశువులను అమ్ముకుని జీవనం సాగించాల్సిన దుర్భర పరిస్థితులలో రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగుంట్ల మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు వేడుకుంటున్నారు.

రూ.30వేలు నష్టపరిహారమివ్వాలి

జిల్లాలో ఏ ఒక్క మండలాన్ని కూడా కరువుగా ప్రకటించకపోవడం దారుణం. ప్రభు త్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతన్నలకు ఎకరాకు రూ.30,000 నష్టపరిహారం ఇవ్వాలి. అలాగే బ్యాంకులలో ఉన్న రైతు రుణా లను మాఫీ చేయాలి. కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి. రైతులను విస్మరించడం ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు సరైంది కాదు.

- అన్వేష్, జిల్లా రైతు సంఘం నాయకులు, సిపిఎం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వర్షం వస్తుందని ఆశతో సేద్యాలు, పాస్పేట్ అంటూ విత్తనానికి సిద్ధం చేసి అప్పుల పాలయ్యాం. దాదాపు ఎకరాకు పదివేలు ఖర్చు చేశాం. ప్రభుత్వం కరువు మండలాల జాబితాలో కూడా చేర్చకపోవడం దారుణం. ఆర్థిక ఇబ్బం దుల్లో ఉన్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. రైతులు కరువుతో అల్లాడుతుంటే ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరం.

- శివారెడ్డి, రైతు, కోడూరు, ఎర్రగుంట్ల మండలం

వంద శాతం హామీల అమలు : 'ఆకుల'

ప్రజాశక్తి - ముద్దనూరు

రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంకేమానికి జగనన్న పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారని వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి, రాయల కాపునాడు కడప జిల్లా అధ్యక్షులు ఆకుల రవికుమార్ అన్నారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి జగన్ పార్టీ, కులమతాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. పారదర్శక పాలన సాగిస్తూ వైసిపి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని నిరూపించారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న కార్యక్రమాలకు వైసిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

గత టిడిపి ప్రభుత్వంలోని పాల కులు ప్రజలను నిర్లక్ష్యం చేసి, అవినీతికి పాల్ప డడంతో ప్రజలు వైసిపికి పట్టం కట్టారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు. సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి సహాయ సహ కారాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభి వృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రజ లకు అందుబాటులో ఉంటూ.. వారి సమ స్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో వైసిపి విజ యానికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటును వైసిపికి వేసి అత్యంత భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాయల కాపునాడు కడప జిల్లా అధ్యక్షు లుగా కాపు, బలిజ, తెగల, ఒంటరి కులాల సమస్యలపై స్పందించి తన వంతు పోరాటం చేస్తానన్నారు. వారికి అన్ని విధాలా అండగా నిలుస్తానని ఆకుల రవికుమార్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం గోపవరం పంచాయతీ, భగత్ సింగ్ కాలనీ 6వ వీధి బీట్ రోడ్డు రూ.11 లక్షలతో నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో ఒక మహిళ రోడ్డు వేయాలని కోరడంతో 60 మీటర్ల సిమెంట్ రోడ్డు, గ్రావెల్ రోడ్డు కలిపి రూ.11లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నామన్నారు. రూ.4 కోట్ల వ్యయంతో హౌసింగ్ బోర్డులో పార్క్ నిర్మాణం త్వరలో నిర్మించనున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు బాబుతోనే భవిష్యత్ అని ఇంటింటికీ తిరిగి బాబుకు ఓటు వేయండని, భవిష్యత్తు గారంటీ అని అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. 2014లో బాబు ఇచ్చిన మానిఫెస్టోకే గారంటీ లేదని, బాబు ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజలు ప్రశ్నిస్తే టిడిపి నాయకులు తలలు ఎక్కడ పెట్టుకుంటారని, స్థానిక నాయకుల భవిష్యత్‌కు గారంటీ గల్లంతు అవుతుందన్నారు. 2014లో హామీలు ఏమేర నెరవేర్చారో టిడిపి శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. వైసిపి 2019 మానిఫెస్టోలో 99శాతం తీర్చిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మాజీ సర్పంచ్ దేవిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ మోషే, ఉపసర్పంచ్, ఎంపీటిసిలు ఓబయ్య యాదవ్, వసుంధర, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోకుల మేరీ, నాయకులు కొండయ్య, గంజికుంట శివారెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు, ప్రజాప్రతినిధులు

మద్యం జోరు.. బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు విక్రయాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండలంలో మద్యం అమ్మకాలు జోరుగా ఉన్నాయి. విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతుండడంతో బెల్టు షాపులు మూడు పువ్వులు.. ఆరుకాయలుగా విరాజిల్లుతున్నాయి. బెల్టు షాపులు లేవని అధికారులు చెబుతున్నా, అవి లెక్కల వరకే పరిమిత మవుతున్నాయి. నూతన ఎక్సైజ్ మద్యం పాలసీని తీసుకు వచ్చి ఎంఆర్‌పికే మద్యం విక్రయించేలా, కల్తీ మద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో వారి వ్యాపారానికి హద్దుల్లేకుండా ఉందనే విమర్శ లున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండా ఏర్పాటైన బెల్ట్‌షాపులు వేళపాళ లేకుండా తెల్లవారుజామునుంచి అర్ధరాత్రి వరకు మద్యం అందుబాటులో ఉంటోంది. కూలి పనులు చేసుకునే నిరుపేదలు బెల్టుషాపులకు అలవాటుప డుతున్నారు. పనులకు వెళ్లడంలేదని పలువురు పేర్కొంటున్నారు.

ఒక మద్యం బాటిల్‌పై ఎంఆర్‌పి కంటే రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు సిండికేట్‌గా మారడంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొన సాగుతున్నాయి. హొటళ్లు, కిరాణా షాపులు, బెల్టు షాపులుగా తయారవుతున్నాయి. మద్యానికి బానిసైన కొందరు వ్యక్తులు అనారోగ్యం పాలవడంతోపాటు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. ఘర్షణలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయి. చేసిన కష్టమంతా తాగుడికే ధార పోస్తున్నారనే విమర్శలున్నాయి. ముఖ్యంగా యువత మద్యా నికి ఆకర్షితు లవుతున్నారు. గ్రామాల్లో ఎక్కువగా ప్రజల మధ్య అల్లరులు, గొడవలు జరుగడానికి మద్యం కారణమవుతోందని చర్చలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా మద్యం నియంత్రణ చెపడతామని చెబుతున్నప్పటికీ బెల్ట్ షాపుల జోరు మాత్రం తగ్గడం లేదు. అధికారులు లాలూచీతోనే బెల్ట్ షాపులను అరికట్ట లేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. బెల్టుషాపుల నిర్వా హకులపై ఎక్సైజ్ అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ బహి రంగ సభను విజయ వంతం చేయా లని సిపిఎం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ఆ మేరకు శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో బిజెపి రెండవసారి అధికారంలోకొచ్చి 9సంవత్సరాకు పైగా కావొస్తోం దన్నారు. ఈ కాలంలో ప్రజలకు సంబంధించిన ఆస్తులన్నీ ప్రైవేటుకు అప్పజెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు నెరవేర్చలేదన్నారు. పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేశాయన్నారు. ప్రతిపక్షం ఏ మాత్రం ప్రశ్నించడం లేదన్నారు. ఇందుకు నిరసనగా ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తామని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్, లక్ష్మీదేవి, భానుమతి, సిసిఎం నాయకులు శేఖర్, శీను పాల్గొన్నారు.

మహిళల్ని గౌరవించడం మా సంప్రదాయం : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : 'మహిళల్ని గౌరవించడం మా సంప్రదాయమని, రాజకీయాలు వేరని, కుటుంబాన్ని రాజకీయాలకు ముడిపెట్టి మాట్లాడే మనస్తత్వం వైసిపి కుటుంబ సభ్యులకెవ్వరికీ లేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. హత్యకు గురైన బిసి నాయకుడు నందం సుబ్బయ్య భార్య అపరాజిత వ్యక్తి త్వాన్ని కించపరిచేలా ఎమ్మెల్యే అనుచరుడు మాలమహానాడు నాయకుడు గోశ మనోహర్ చెప్పినట్లు పత్రికల్లో (ప్రజాశక్తి కాదు) రావడాన్ని ఎమ్మెల్యే శనివారం విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. నియోజక వర్గంలో వైసిపి రాజకీయ కుటుంబ సభ్యులుగా 70మంది మహిళలున్నారని, తమ మధ్య అన్నాచెల్లెళ్ల అనుబంధం ఉందన్నారు. ఇటీవల జరిగిన బెనర్జీ హత్యాయత్నంలో అపరాజిత ప్రధాన సూత్రధారి అని బెనర్జీ కుటుంబ సభ్యులతో పాటు తాము కూడా అభిప్రాయపడుతున్నామన్నారు. ఇది నిజ మా కాదా అన్నది కోర్టు తేల్చాల్సి ఉందన్నారు. ఈ విషయాలు చెప్పే క్రమం లో మనోహర్ మాట్లాడాడని, ఇందులో అపరాజిత మనసుకు బాధ కలిగి ఉం టే మనోహర్‌ను మన్నించాలని రాచమల్లు కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్‌లు గనిశసాటి లక్ష్మీదేవి, చింతకుంట సరితారెడ్డి, వరికూటి ఓబులరెడ్డి పాల్గొన్నారు. అనంతరం విడిగా గోస మనోహర్ మాట్లాడుతూ మహిళల పట్ల తమకు అత్యంత గౌరవం ఉంద న్నారు. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగేలా ఎప్పుడూ మాట్లాడనని పేర్కొన్నారు.

ఇరువురు నేత్రదానం

పులివెందుల రూరల్ : స్థానిక భాకరాపురానికి చెందిన దోర్నాల రామసుబ్బమ్మ మరణించడంతో ఆమె కుమార్తెలు నాగసుబ్బమ్మ, ఆదిలక్ష్మి, తులసి బృంద, అల్లుళ్ళు వెంకటసుబ్బారెడ్డి, పురుషోత్తంరెడ్డి, కొండారెడ్డి, మరిది, వైసిపి శీతల గిడ్డంగులు డైరెక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి నేత్రదానానికి అంగీకరించారు. అలాగే సింహాద్రిపురం మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన బెడదల రామలక్షుమ్మ మృతి చెందడంతో ఆమె కుమారులు హరినారాయణరెడ్డి, అమరేం ద్రరెడ్డి,అసురేంద్రరెడ్డి కోడళ్ళు కాంతమ్మ, చైతన్య, మనవడు అశోక్‌కుమార్‌రెడ్డి నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి రాజు మృతదేహాల నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

విఆర్‌ఓ నరసింహాచారి మృతికి సంతాపం

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : స్థానిక గోపవరం-2 సచివాలయ విఆర్‌ఓ నరసింహాచారి మృతికి సిపిఎం ప్రొద్దుటూరు ఏరియా కార్యదర్శి కె.సత్యనారాయణ, తహశీల్దార్ నజీర్ అహ్మద్, డిటి మనోహర్‌రెడ్డి, ఆర్‌ఐలు నాగమోహన్ రెడ్డి, సుదర్శన్, సతీష్ విఆర్‌ఓలు నివాళులర్పించారు. నరసింహాచారి మరణం బాధాకరమని తెలిపారు. అధికారులు నరసింహాచారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

సచివాలయాల్లో నగదు రహిత సేవలు

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం నూతనంగా అందు బాటులోకి తీసుకొచ్చిన నగదు రహిత సేవలను ప్రజలు సద్విని యోగం చేసు కోవాలని ఈఓపీఆర్డి రాధాకృష్ణవేణి సూచిం చారు. శనివారం పంచా యతీ కార్యదర్శులకు యూనియన్ బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో స్కానింగ్, ఏటీఎం కార్డు, స్వైప్ మిషన్లు అందజేశారు.

సర్పంచ్‌కు సామగ్రి అందజేస్తున్న రాధాకృష్ణవేణి

ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ సచివాలయాల్లో వివిధ సేవల కోసం వచ్చే ప్రజలు ఇక మీదట నగదు కాకుండా ఫోన్ పే, పేటీఎం వంటి ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లించాల్సి ఉంటుం దన్నారు. ఇంటి పన్ను చెల్లింపునకు కూడా ఆన్‌లైన్ సేవలను వినియోగిం చుకోవాలన్నారు. ప్రజలు పంపిన నగదు నేరుగా గ్రామపంచాయతీ ఖాతాలోకి జమ అవుతుందన్నారు. ఈ విధానం ద్వారా సిబ్బంది ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశం ఉండదన్నారు. అనంతరం యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ ఆన్‌లైన్ సేవలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు.

6న వ్యాపారుల పాత బకాయిపై సదస్సు

ఎపి టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.షరీఫ్‌ఖాన్

ప్రజాశక్తి- కడప అర్బన్

వ్యాపారుల పాత బకాయిపై ఈనెల 6న సదస్సు నిర్వహించనున్నట్లు ఎపి టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ షరీఫ్ ఖాన్ తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు అప్సర హాలు వద్ద ఉన్న శ్రీనివాసా రెసిడెన్సీలో సదస్సు ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎపి జిఎస్‌టి చట్టంలో, వ్యాట్ చట్టంలో ఉన్న పాత బకాయిలను, అపీల్స్ లో ఉన్న బకాయిలను వన్ టైం సెటిల్మెంట్ స్కీమును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి వ్యాపార వర్గాల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మూడేళ్లుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి రాజేంద్రనాథ్ రెడ్డి, జిఎస్‌టి స్టేట్ చీఫ్ కమిషనర్‌కు అనేక సందర్భాలలో పాత బకాయిలను వన్ టైం సెటిల్మెంట్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. వన్ టైం సెటిల్మెంట్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యాపారులు పాత బకాయిలను చెల్లించినట్లయితే వ్యాపారులకు ఉపశమనం లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని వేల కోట్ల రూపాయలు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపారులు సదస్సులో పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్‌పై వైసిపి గిరిజన ఉపముఖ్యమంత్రి రాజన్న దొర తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజన్న దొర అవినీతిని ప్రశ్నించినందుకు ధారూనాయక్‌పై గతంలో అక్రమ కేసులు బనాయించారని తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర మంత్రి పదవి చేపట్టి రెండున్నర సంవత్సరాలు పూర్తయినా ఇంతవరకు గిరిజనలకు చెందిన 18 సంక్షేమ పథకాల గురించి ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. నాలుగున్నర సంవత్సర కాలంలో గిరిజనులపై జరిగిన దాడులకు సంబంధించి 1320 కేసులు నమోదైనట్లు చెప్పారు. గిరిజన గ్రామాల్లో సరైన రోడ్డు సదుపాయాల్లేవన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి కార్యకర్తలు మల్లికార్జున, కార్తిక్, రామచంద్ర, దేవేంద్ర పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి టిడిపి అధికారంలోకి రావాలని భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలోని షాదీఖానా దగ్గర నుంచి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి శనివారం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు.

మహిళలకు అభివాదం చేస్తున్న భూపేష్‌రెడ్డి

ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో పన్నులు పెంచుకుంటూ పోతున్న ఈ ప్రభు త్వాన్ని గద్దెదించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎర్రగుంట్ల మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందే తప్ప, వైసిపి ప్రభుత్వం వచ్చి ఇప్పటికీ నాలుగున్నర సంవత్సరం పూర్తవుతున్నా ఏ మాత్రం పురోగతి చెందలేదన్నారు. స్థానిక సమస్యలు తన దృష్టికి రాగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, రమేష్‌రెడ్డి, బయపురెడ్డి, సూరి, సంజీవరెడ్డి, రామసుబ్బయ్య, రమణారెడ్డి, వెంకటేష్, సాంబ, గంగరాజు, గురప్ప, వెంకటేష్, రామాంజనేయులు, వంశీ, ప్రతాప్, విజయ్‌కుమార్, కిషోర్, రమేష్, రవికుమార్, కొండారెడ్డి, మల్లేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండాపురంలో దుర్గంధం

- పట్టని అధికారులు

ప్రజాశక్తి - కొండాపురం

మండల కేంద్రంలో రోజు రోజుకూ దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొండాపురం పట్టణంలో చికెన్ వ్యాపారులు చేస్తున్న నిర్వాకం వల్ల పట్టణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పట్టణంలోని చికెన్ వ్యాపారులు తమ సెంటర్లలోని వ్యర్థ పదార్థాలను తెచ్చి రామచంద్ర నగర్ పునరావాస కాలనీ సమీపంలో వేస్తున్నారు. ఇది రోజురోజుకూ దుర్వాసనను పెంచుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. జాతీయ రహదారిపై వెళుతున్న పాదచారులు, వాహనదారులు కంపు భరించలేని స్థితిలో ఆవేదనకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రామచంద్రనగర్ కాలనీ వాసులు ఈ వాసన భరించలేక దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. ఈ సమస్యపై ఏ అధికారికి ఫిర్యాదు చేయాలో తెలియని స్థితిలో ప్రజలు ఉన్నారు. ఇక్కడి పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులు సమస్య తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా చికెన్ వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకొని వ్యర్థపదార్థాలను గ్రామానికి దూరంగా తీసుకెళ్లి గొయ్యిలో పూడ్చి పెట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జనాదరణ పొందుతున్న 'చల్లా'

ప్రొద్దుటూరు (పుట్టపర్తిసర్కిల్) : పట్టణంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకృష్ణాలయ యాదవ సేవ కమిటీ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం రోజురోజుకూ జనాదరణ పొందుతోంది. ప్రతివారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ దగ్గర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజ గోపాల్ ప్రారంభించారు.

అన్నదానం చేస్తున్న చల్లా రాజగోపాల్

ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి శనివారం, ప్రతినెల పౌర్ణమి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామన్నారు. తన శక్తి ఉన్నంత మేరకు అన్నదానాన్ని కొనసాగిస్తానని తెలిపారు. మూరబోయిన శ్రీనివాస యాదవ్, సీతంపల్లి రమణ, నల్లం రవిశంకర్, యేసునాథరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం శ్రీనివాసులు, రామచంద్ర రాజు, బోడెం ప్రసాద్, శివ పాల్గొన్నారు.